రేపు శ్రీరామ పట్టాభిషేకం



మాట్లాడుతున్న సినీనటుడు, ఫిలింనగర్ దైవసన్నిధానం చైర్మన్ డాక్టర్ మోహన్‌బాబు

బంజారాహిల్స్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): అయోధ్య శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన పురస్కరించుకొని విశాఖ శారదాపీఠ పాలిత ఫిలింనగర్ దైవసన్నిధానంలో కోదండరామస్వామి దేవాలయంలో 22వ తేదీ వరకూ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు సినీనటుడు, ఆలయ చైర్మన్ డాక్టర్ మోహన్‌బాబు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... శనివారం మన్యుసూక్త సహిత హనుమాన్ గాయత్రిహోమం, రామాయణం ఉత్తరకాండ ప్రవచనం నిర్వహించినట్టు వివరించారు. 21న సీతారామస్వామి మూల విరాట్‌కు విశేష నదీసాగర జలాలతో అభిషేకం అనంతరం సీతారామస్వామి శాంతి కల్యాణం, 22న సప్తవిధ పుష్పార్చన, సీతరామ నగర రథయాత్ర, శ్రీరామ పట్టాభిషేక మహోత్సవం నిర్వహించనున్నట్టు వివరించారు. ఈ వేడుకల కోసం ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. ఈ సమావేశం సినీ రచయిత పరుచూరి గోపాలకృష్ణ, ఆలయ పాలక మండలి కోశాధికారి, మాజీ కార్పొరేటర్ కాజా సూర్యనారాయణ, నటుడు బాలాజీ, నిర్మాత ఆదిశేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

రజకుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం: కిషన్‌రెడ్డి



దోభీఘాట్ వద్ద పవర్‌బోర్‌ను ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ డాక్టర్ లక్ష్మణ్, కార్పొరేటర్ రచనశ్రీ తదితరులు

కవాడిగూడ, జనవరి 20(ఆంధ్రజ్యోతి): రజకుల సంక్షేమానికి విశ్వకర్మయోజన పథకం ద్వారా రుణాలు అందజేయడానికి తమ ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. శనివారం కవాడిగూడ డివిజన్ లోయర్ ట్యాంక్‌బండ్‌లోని బుద్ధ పూర్ణిమ దోబీఘాట్ వద్ద ఏర్పాటు చేసిన నూతన పవర్ బోర్, మోతిలాల్‌నగర్‌లో ఏర్పాటుచేసిన పవర్ బోరింగ్‌ను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్, స్థానిక కార్పొరేటర్లతో కలిసి ప్రారంభించారు. రజకుల అభివృద్ధి, సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అన్నివిధాలుగా చర్యలు తీసుకుంటోందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రజక(దోబీ) అభివృద్ధి సంస్థ చైర్మన్ బొమ్మరాజు కృష్ణమూర్తి, వైస్ చైర్మన్, గ్రేటర్ హైదరాబాద్ చైర్మన్ ఎం.నర్సింహా రజక, గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శులు చంద్రమోహన్, పి.కృష్ణ, బుద్ధపూర్ణిమ దోబీఘాట్ అధ్యక్షుడు రమేష్, ప్రధాన కార్యదర్శి పి.సత్యనారాయణ, సెక్రటరీ సత్యనారాయణ, నేతలు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ ప్రారంభం

చిక్కడపల్లి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్ అశోక్‌నగర్ కల్చరల్ వెల్ఫేర్ సెంటర్ నూతన కమ్యూనిటీహాల్ భవనాన్ని ఎంపీ డా. లక్ష్మణ్, కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్‌తో కలిసి కేంద్రమంత్రి జి. కిషన్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. అయోధ్యలో శ్రీరాముడి ఆలయ ప్రారంభ సమయంలో ఈ కమ్యూనిటీహాల్ ప్రారంభం కావడం శుభసూచకమన్నారు. ఈ కమ్యూనిటీహాల్‌లో సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు డిజిటల్ లైబ్రరీని నిర్వహించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ సూర్యప్రకాష్, డీఎంసీ డా. తిప్పర్తి యాదయ్య, హిమాయత్‌నగర్ తహసీల్దార్ సంధ్యారాణి, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

'దేవాదాయ శాఖను రద్దు చేయాలి'

కవాడిగూడ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): దేవాలయాల ఆస్తులను దోపిడీ చేస్తున్న దేవాదాయ శాఖను తక్షణమే రద్దు చేయాలని భారత్ నేషనల్ లిస్టు ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు రాజు కొత్తకోట ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో భారత్ నేషనలిస్టు ఫోరం ఆధ్వర్యంలో దేవాదాయశాఖను రద్దు చేసి నూతన సనాతన ట్రస్ట్ ఏర్పాటు చేయాలని ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కొత్తకోట రాజు మాట్లాడుతూ, హిందూ ఆలయాలకు సంబంధించిన భూములు రక్షించబడాలంటే దేవాదాయ శాఖను రద్దు చేయడమే మార్గమని పేర్కొన్నారు. ఆలయాలు హిందూ సాంస్కృతిక కేంద్రాలు అని వాటిని వ్యాపార కేంద్రాలుగా మార్చారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దేవాలయాల అభివృద్ధికి భక్తులు ఇచ్చిన విరాళాలను 34 శాతం పన్నుల రూపంలో ప్రభుత్వం తీసుకోవడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. వెంటనే తెలంగాణ ప్రభుత్వం ఆలోచించి దేవాదాయశాఖను రద్దు చేసి సనాతన ట్రస్ట్ ఏర్పాటు చేయాలని కోరారు. ధర్నాలో రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబుద్యాప, కార్యదర్శి వంశీ కృష్ణ, నాయకులు మల్లికార్జున్, మాతా శివపార్వతి దంపతులు, భక్తులు, హిందువులు పాల్గొన్నారు.

సున్నిత సునిశిత మనస్వి బాపు



బాపు పురస్కారగ్రహీత తనికెళ్ళ భరణి నుంచి బాపు చిత్రకళా పురస్కారం అందుకుంటున్న కె. సాయినాగచరణ్

చిక్కడపల్లి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): సినీ దర్శకుడు, చిత్రకారుడు బాపు సున్నిత సునిశిత మనస్వి అని ఆయన తీసిన ప్రతి చిత్రం కళాఖండమని ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.విజయ బాబు అన్నారు. కళా నిలయం సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో త్యాగరాయగానసభలో శనివారం రాత్రి బాపు 90వ జయంతిని పురస్కరించుకొని ప్రముఖ సినీ నటుడు, సాహితీ వేత్త, దర్శకుడు తనికెళ్ల భరణికి బాపు పురస్కార ప్రదాన సభ నిర్వహించారు. ముఖ్య అతిథి విజయబాబు పురస్కారం బహూకరించి మాట్లాడారు. నటనలో నవరసాలను పలికించే శక్తి భరణికి ఉందని, ఇందుకు కారణం రచయితగా అయన అక్షరాల్లో ప్రతి పాత్ర ఆవిష్కృతం అవుతుందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పక్షాన భరణికి జీవిత సాఫల్య పురస్కారం బహూకరిస్తామని ప్రకటించారు. సాహితీవేత్త డా.వోలేటి పార్వతీశం మాట్లాడుతూ భరణి కేవలం నటుడు మాత్రమే కాదని, జీవితాన్ని కాచి వడబోసిన ఉన్నత వ్యక్తిత్వం కలవారని పేర్కొన్నారు. కేంద్ర సంగీత నాటక అకాడమీ కౌన్సిల్ సభ్యురాలు, నాట్యగురువు డా. ఎస్పీ భారతి అధ్యక్షత వహించిన సభలో కళాపోషకులు కె.ఈ.రాజు, ఎం.వెంకటేశ్వరరావు, స్వప్న తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంలో బాపు 90వ జయంతిని పురస్కరించుకుని 90 మంది నాలుగేళ్ళ బాలలనుంచి ఎనభై ఏళ్ళ వయోధికుల వరకు వేసిన చిత్రాలు జై ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదు అయినట్టు సుభాషిణి ప్రకటించి సర్టిఫికెట్ భరణి ద్వారా అందజేశారు. చిత్రాలు వేసిన కె. సాయినాగ చరణ్‌కు బాపు చిత్రకళాపురస్కారాన్ని తనికెళ్ళ భరణి బహూకరించి ఆశీర్వదించారు. రికార్డ్ నమోదు పత్రం సంస్థ అధ్యక్షురాలు పుష్పలత అందుకోగా కార్యదర్శి సురేందర్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

కల్లుగీత కార్మికులకు సేఫ్టీ మోకులు ఇవ్వాలి

- రాష్ట్ర కల్లు గీత కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు

రాంనగర్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): కల్లు గీతపై ఆధారపడ్డ గీత కార్మికుల ప్రమాద నివారణ చర్యలు చేపట్టి, సేఫ్టీ మోకులు అందజేయాలని రాష్ట్ర కల్లు గీత కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎం.వి.రమణ, బెల్లంకొండ వెంకటేశ్వర్లు కోరారు. శనివారం వారు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఎన్నికల ముందు కల్లు గీత కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. మంత్రికి వినతి పత్రం ఇచ్చినవారిలో సంఘం నాయకులు వెంకటనర్సయ్య, ఎం.కృష్ణ, స్వామిగౌడ్, సుధాకర్‌గౌడ్, ఆంజనేయులుగౌడ్, హరిచరణ్‌గౌడ్, దేవదాస్‌గౌడ్ ఉన్నారు.

పెండింగ్ గౌరవ వేతనం చెల్లించాలి

- తెలంగాణ న్యాయవాదుల జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి

కవాడిగూడ, జనవరి 20(ఆంధ్రజ్యోతి): సేవలందిస్తున్న న్యాయవాదులకు పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనాన్ని వెంటనే చెల్లించాలని తెలంగాణ న్యాయవాదుల జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. శనివారం కవాడిగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తెలంగాణలోని న్యాయ వ్యవస్థలో జిల్లా కోర్టులు, కింది కోర్టుల్లో పీపీలుగా, జీపీలుగా, ఏజీపీలుగా, స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులుగా న్యాయవాదులు పనిచేస్తున్నారని అన్నారు. వారికి 2022 సెప్టెంబర్ నుంచి రావాల్సిన గౌరవ వేతనం ఇప్పటివరకు ఇవ్వలేదన్నారు. దీంతో న్యాయవాదులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి వెంటనే గౌరవ వేతనం అందేలా చూడాలని ఆయన కోరారు.

సర్వం రామమయం



పద్మశాలి కాలనీలో రామనామ పారాయణం చేస్తున్న భక్తులు



ముషీరాబాద్‌లో శ్రీరాముడి అక్షింతలను ఊరేగిస్తున్న బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గ జాయింట్ కన్వీనర్ నవీన్‌గౌడ్

ముషీరాబాద్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): అయోధ్యలో ఈనెల 22న జరగనున్న శ్రీరామ విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా ప్రతి ఇంటి ఎదుట ఐదు దీపాలు వెలిగించాలని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పూసరాజు అన్నారు. అయోధ్యలో రామమందిర ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని బీజేపీ అధిష్ఠానం పిలుపుమేరకు శనివారం భోలక్‌పూర్ డివిజన్‌లోని రంగానగర్‌లోని భూలక్ష్మి దేవి ఆలయంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించి చెత్తా చెదారాన్ని తొలగించారు. కార్యక్రమంలో బీజేపీ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు రవి కుమార్, దళిత మోర్చా మహంకాళి జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణ, దళితమోర్చా డివిజన్ అధ్యక్షుడు ధర్మేందర్, నా యకులు సత్యనారాయణ, విజయ్, మహేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి కాలనీలో శ్రీరామ నామ పారాయణం

అయోధ్యలో శ్రీరామ విగ్రహ ప్రతిష్ఠాపణ మహోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం పద్మశాలి కాలనీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శ్రీరామ అమృతోత్సవాలు నిర్వహిస్తున్నారు. కాలనీ వాసులు శ్రీరాముడికి పూజలు నిర్వహించి శ్రీరామ నామ పారాయణాలను ఆలపించారు. కార్యక్రమంలో సొసైటీ మహిళా కమిటీ అధ్యక్షురాలు సుజాత, మంగ, కాలనీ అధ్యక్ష కార్యదర్శులు సుందర్‌పటాలే, ఆర్ ఆంజనేయులు పాల్గొన్నారు.

ముషీరాబాద్‌లో శ్రీరాముడి అక్షింతల ఊరేగింపు

ముషీరాబాద్‌లో డివిజన్ బీజేపీ కమిటీ ఆధ్వర్యంలో శనివారం అయోధ్య శ్రీరాముడి అక్షింతలను బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గ జాయింట్ కన్వీనర్ ఎం. నవీన్‌గౌడ్ ఇంటింటికీ వెళ్లి భక్తులకు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు బద్రినారాయణ, కంచి కుమార్, నాయకులు మెట్టు వాసు, సత్యనారాయణ, లక్ష్మణ్ పాల్గొన్నారు.

రేపు శ్రీరాముడికి ప్రత్యేక పూజలు

రాంనగర్: అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ నేపథ్యంలో వాసవీ సేవాసమితి రాంనగర్ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 22న ఉదయం 11.30కు రాంనగర్ చౌరస్తాలో శ్రీరాముడికి ప్రత్యేక పూజలు చేసి అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు సేవా సమితి ప్రతినిధులు తెలిపారు. శనివారం రాంనగర్‌లోని సేవా సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సేవా సమితి కన్వీనర్ కాసనగొట్టు రాజశేఖర్ గుప్తా, అధ్యక్షుడు వాడకట్టు రాజు, ప్రధాన కార్యదర్శి శివకుమార్, ప్రాజెక్ట్ చైర్మన్ బుక్క రమేష్ గుప్తా, కో చైర్మన్ నేతి సత్యనారాయణ, కోశాధికారి గంజి శ్రీనివాస్ మాట్లాడారు. ఈకార్యక్రమాలకు సేవా సమితి సభ్యులు రాంనగర్ ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

'108 సార్లు శ్రీరామజపం చేయాలి'

కవాడిగూడ: అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠను విజయవంతం చేయాలని బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గ కన్వీనర్ ఎం.రమేష్‌రాం పిలుపునిచ్చారు. శనివారం ఆయన కవాడిగూడలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గంలోని ఆరు డివిజన్లలోని ప్రజలు ప్రతి ఇంట్లో ఐదు దీపాలు వెలిగించి 108 సార్లు శ్రీరామజపం చేయాలని సూచించారు.

గోల్నాక: అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన, ఆలయ ప్రారంభోత్సవం విజయవంతం కావాలని ఆలయాల్లో జరిగే కార్యక్రమాల్లో భక్తులు పాల్గొన్నాలని, తమ ఇళ్లలో ఐదు దీపాలను వెలిగించాలని కర సేవకులు, రామభ క్తులు చింతల శ్రీనివాస్ ముదిరాజ్, నాయిని బుచ్చిరెడ్డి అన్నారు. శనివారం గోల్నాక డివిజన్ జైస్వాల్‌గార్డెన్‌లోని సామాజిక భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లడారు.

ఆలయం వద్ద శుభ్రం చేసిన బీజేపీ నేతలు

స్వచ్ఛభారత్ అభియాన్‌లో భాగంగా శనివారం బీజేపీ గోల్నాక డివిజన్ అధ్యక్షుడు మూల రవీందర్ గౌడ్ ఆధ్వర్యంలో గోల్నాక కొత్త బ్రిడ్జి వద్ద ఉన్న హనుమాన్ ఆలయ పరిసరాలను బీజేపీ నేతలు శుభ్రం చేశారు. కార్యక్రమానికి బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు హాజరై నేతలతో కలిసి ఆలయం పరిసరాల్లో శుభ్రం చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కేసరి నర్సింగ్‌రావు యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

శ్రీరామ దివ్యవైభవం కవితాసంపుటి ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

చిక్కడపల్లి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): అయోధ్యలో జరగనున్న శ్రీరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకొని శ్రీగీతా ఫౌండేషన్, లక్ష్య సాధన ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం త్యాగరాయగానసభలో వందమంది కవుల కవితా సంపుటి శ్రీరామ దివ్యవైభవం ఆవిష్కరణ సభ నిర్వహించారు. సాహితీవేత్త డా.జయరాములు ఈసందర్భంగా పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడుతూ మోదీ నేతృత్వంలో ఈకార్యక్ర మంజరగడం అభినందనీయమని అన్నారు. నేడు ఆవిష్కృతమైన గ్రంథం ప్రతులను ప్రధానికి అందించనున్నామని సభాధ్యక్షత వహించిన రామకృష్ణ చంద్రమౌళి తెలిపారు. మార్చి చివరి వారంలో అయోధ్యలో 1000మంది కవులతో కవిసమ్మేళనం నిర్వహించనున్నట్టు తెలుగుభాషా చైతన్య సమితి అధ్యక్షుడు పి.బడేసాబ్ తెలిపారు. రాజు, యోగేష్‌ప్రభు, బద్రీనాథ్, సీపీరెడ్డి, అంజనికుమారి, జేవీ కుమార్, ప్రవీణ్, రాధాకుసుమ, సోమయాజుల ప్రసాద్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గురువుల బోధనతో ప్రగతికి బాటలు

- ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త డాక్టర్ చూడామణి



మహాపండితుల జయంతి ఉత్సవాల్లో మాట్లాడుతున్న ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త డాక్టర్ టి.కె. చూడామణి

అల్వాల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): లౌకికంగా కాని ఆధ్యాత్మికంగా కాని పురోగతిని పొందాలంటే సద్గురువుల మార్గదర్శనం తప్పక లభించాల్సిందేనని ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త, ప్రవచన కర్త డాక్టర్ టి.కె. చూడామణి అన్నారు. ఓల్డ్ అల్వాల్‌లో శ్రీవైష్ణవ సంప్రదాయ పరిరక్షణకు, ప్రచారానికి జీవితకాలం కృషి చేసిన స్వామినాథ దేశిక, శ్రీరంగ శఠకోప దేశిక, వెంకట నరసింహ దేశికుల జయంతి ఉత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న విశిష్ఠ ఉపన్యాస కార్యక్రమానికి రెండో రోజు శనివారం ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఏ రంగంలో రాణించాలన్నా, ఆయా రంగాల్లో నిష్ణాతులైన గురువుల బోధనలను శ్రద్ధగా విని, వాటిని ఆచరించాలి. అప్పుడే ప్రగతిపథంలో పయనించగలుగుతామని చూడామణి పేర్కొన్నారు. నిర్వాహకులు సముద్రాల శఠగోపాచార్య మాట్లాడుతూ తరతరాలకు చెరగని నిధిగా విజ్ఞాన సంపదను మన పూర్వీకులైన ఆచార్యులు సమాజానికి గ్రంథస్థం చేసి సురక్షితంగా అందించారని, వాటిని అధ్యాయనం చేసి ఆదర్శవంతమైన జీవనాన్ని గడుపాలన్నారు. ప్రాచీన విజ్ఞానాన్ని ఆధునిక యువతకు అందించేందుకు తాను 15 గ్రంథాలను రచించానని, ప్రముఖ దినపత్రికలలో వ్యాసాలను రచిస్తూ కాలమిస్ట్‌గా బాధ్యతలు కొనసాగిస్తున్నాని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో భక్తులు రసజ్ఞులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఇథనాల్ పాలసీ అమలు అప్రజాస్వామికం



సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

రాంనగర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రజలతో చర్చించకుండా ఇథనాల్ పాలసీ అమలు చేయడం అప్రజాస్వామికం అని పలువురు వక్తలు పేర్కొన్నారు. శనివారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో ప్రొఫెసర్ హరగోపాల్ అధ్యక్షతన ఆహార పంటలతో ఇథనాల్ ఇంధనం-సాధ్యత, సుస్థిరత, శాస్త్రీయత అనే అంశంపై సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సదస్సులో కేంద్ర ప్రభుత్వ మాజీ కార్యదర్శి డాక్టర్ ఈఏఎస్ శర్మ ఆన్‌లైన్‌లో మాట్లాడుతూ దేశంలో ప్రతి పాలసీని ప్రజలతో చర్చించకుండా ఏసీ రూములలో కూర్చుని చేస్తున్నారని ఆరోపించారు. ఇది పూర్తిగా ప్రజాస్వామ్య వ్యతిరేకమన్నారు. ఇథనాల్ ఉత్పత్తిని బ్రెజిల్, అమెరికా వంటి అభివృద్ధి చెందిన దేశాలు వదిలిపెట్టిన తర్వాత భారతదేశం తీసుకురావడం సరైంది కాదన్నారు. ఇథనాల్ ఉత్పత్తిని వెంటనే నిలిపివేయాలని లేనిపక్షంలో భవిష్యత్‌లో నీటి వినియోగం పెరిగి భూగర్భ జలాలు అంతరించిపోతాయన్నారు. శాస్త్రవేత్తలు డాక్టర్ బాబురావు, డాక్టర్ అహ్మద్‌ఖాన్, డాక్టర్ వెంకట రెడ్డి మాట్లాడుతూ మనిషి ప్రకృతిని విధ్వంసం చేస్తున్నాడని, భూమిపై 21 శాతం ఆక్సిజన్ ఉన్నందునే మానవులు, జీవకోటి జీవించగలుగుతున్నాయని అన్నారు. ఏ గ్రహంపై కూడా ఆక్సిజన్ లేదు కాబట్టి కేవలం భూమిపై జీవకోటికి అనుకూలమైన ప్రదేశం ఉందన్నారు. 2030 వరకు ఇదే విధంగా ప్రకృతి విధ్వంసానికి పాల్పడి భూతాపం పెరిగి ప్రకృతి మనిషి జీవితంపై జీవకోటిపై ఆధిపత్యం చెలాయించి సమతుల్యతను దెబ్బతీసే అవకాశం ఉందన్నారు. సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ జి.విజయ్ మాట్లాడుతూ ఇథనాల్ ఉత్పత్తిని ఆపివేయాలన్నారు. రైతు స్వరాజ్య వేదిక నాయకుడు కన్నెగంటి రవి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయంపై సమగ్ర విధానాలు రూపొందించడం లేదన్నారు. ప్రొఫెసర్ ఆమంచి రాజేశ్వర్‌రావు, ప్రొఫెసర్ కె.వై.రత్నం, పర్యావరణ వేత్త ఎం.సత్యనారాయణరావు, పలువురు మేధావులు మాట్లాడుతూ ఇథనాల్ ఉత్పత్తుల వల్ల జరిగే అనర్థాలపై సోదాహరణంగా వివరించారు.

'ఇతర కులాలకు సభ్యత్వం ఇవ్వకూడదు'

కవాడిగూడ, జనవరి 20(ఆంధ్రజ్యోతి): గంగపుత్రుల మత్స్య సొసైటీల్లో ఇతర కులాలకు సభ్యత్వం ఇవ్వకూడదని తెలంగాణ గంగపుత్ర మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.కె. ప్రసాద్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం తెలంగాణ గంగపుత్ర మహాసభ ఆధ్వర్యంలో ఇందిరా పార్కు ధర్నాచౌక్ వద్ద గంగపుత్రుల గోస పేరుతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి ఫిషరీస్ డిపార్ట్‌మెంట్‌కు ఐఏఎస్ అధికారిని నియమించకుండా రాజకీయ నాయకుల స్వార్థంతో గంగపుత్ర సొసైటీలను నాన్ ఐఏఎస్ అధికారులతో సహకార సంఘాలను నిర్వీర్యం చేశారని ఆరోపించారు. ప్రభుత్వం చేప పిల్లల ఉత్పత్తి సెంటర్లకు సౌకర్యాలు కల్పిస్తూ ప్రైవేట్ సెక్టార్లను కూడా ప్రోత్సహించి రాష్ట్రంలో పూర్తి స్థాయిలో చేపపిల్లల ఉత్పత్తి జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. జీవో 6ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి పిల్లి వంశీకృష్ణ, కోశాధికారి బీజాల శ్రీనివాస్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఎం స్వరూప, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నమత్స్య కార సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

రంజిత్‌రెడ్డి దోచుకునేందుకే వచ్చాడు

- జిల్లాలో భూముల స్కాములన్నింటిలోనూ పాత్రధారే
- మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, బీజేపీ నేతలు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి): చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి జిల్లాలో ఆస్తులు కొల్లకొట్టేందుకే వచ్చారని బీజేపీ నేతలు ఆరోపించారు. జిల్లాలోని పలు భూముల కుంభకోణాలతో పాటు రాష్ట్రంలో కోళ్లదాణ, కోడిగుడ్ల స్కామ్‌లకు ఆయనే సూత్రధారి అని ఆరోపించారు. లక్డీకపూల్‌లో శనివారం బీజేపీ నేత, చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నంతో పాటు రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్ రెడ్డి, శేరిలింగంపల్లి ఇన్‌చార్జి రవియాదవ్ తదితరులు మాట్లాడారు. రియల్ ఎస్టేట్ సెటిల్‌మెంట్లు, దందాలు తప్పా ఆయన చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో ఏం అభివృద్ధి చేశారని ప్రశ్నించారు. రంజిత్‌రెడ్డికి స్థానిక సమస్యలపై అవగాహన లేదని అన్నారు. బ్లాక్‌మెయిల్ రాజకీయాలు మాత్రమే ఆయనకు తెలుసని విమర్శించారు. చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో రోడ్లన్నీ అస్తవ్యస్తంగా ఉన్నా ఆయన ఫామ్‌హౌస్‌కు మాత్రం కొత్త రోడ్డు వేసుకున్నారని ఎద్దేవా చేశారు. ఇటీవల వెలుగులోకి వచ్చిన నానక్ రాంగూడ, గోపన్నపల్లి భూముల కుంభకోణాలతో పాటు ఫిల్మ్‌నగర్‌లో రూ.వందల కోట్ల దేవాలయ భూములు కొల్లకొట్టిన వ్యవహారంలో కూడా రంజిత్‌రెడ్డే సూత్రధారి అని విమర్శించారు. మాజీ మంత్రి కేటీఆర్‌తో కలిసి హైదరాబాద్ శివార్లలో అనేక భూదందాలు చేశారని, వీటన్నింటిపై తాము విచారణ కోరతామన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం వైఖరి వల్లే హైదరాబాద్ - బీజాపూర్ హైవే పనులు నిలిచిపోయాయని, రోడ్డు విస్తరణ పనులు ఆగిపోతే ఎంపీ రంజిత్‌రెడ్డి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఇంత అసమర్థ ఎంపీని ఎక్కడా చూడలేదన్నారు. శంకరపల్లిలో డబుల్‌బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపులో స్థానికులకు అన్యాయం జరిగితే ఆయన ఎక్కడున్నారన్నారు.

నోరు అదుపులో పెట్టుకోకుంటే తగిన శాస్తి చేస్తాం

ఎంపీ రంజిత్‌రెడ్డి నోరు అదుపులో పెట్టుకోవాలని వారు హితవు పలికారు. లేదంటే తగిన శాస్తి చేయాల్సి ఉంటుందని బీజేపీ నేతలు హెచ్చరించారు. ఇటీవల మాజీ ఎంపీ విశ్వేశ్వరెడ్డిపై రంజిత్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలపై తక్షణమే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. రెండు రోజుల కిందట ఒక గ్రామ సర్పంచ్‌కి మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వరెడ్డి ఫోన్ చేసి తమ పార్టీ సిద్ధాంతాలు నచ్చితే బీజేపీలోకి రావాలని కోరారని చెప్పారు. దీనిపై రంజిత్‌రెడ్డి స్పందించిన తీరు సిగ్గుచేటన్నారు. డబ్బు, హోదాను చూసి అహంకారంతో వ్యవహరిస్తున్నారని ఆయనకు ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. విలేకరుల సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి, చేవెళ్ల కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, పరిగి నేత పరమేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరాం

రాంనగర్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం.కోదండరాం అన్నారు. ఆలిండియా డిసేబుల్డ్ రైట్స్ ఫోరం ఆధ్వర్యంలో శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నూతన ప్రభుత్వం - దివ్యాంగుల అభివృద్ధి అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు ప్రత్యేక శాఖను ఏర్పాటుతో పాటు మార్పును సాధించుకోవడానికి కృషి చేద్దామన్నారు. దివ్యాంగుల హక్కుల వేదిక జాతీయ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ దివ్యాంగుల పెన్షన్ 1 నుంచి 5వ తేదీలోపు వారి బ్యాంకు ఖాతాలో రూ. 6 వేలు వేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు అంబటి శ్రీనివాస్, యూన్సీ, ప్రఫుల్ రాంరెడ్డి, ఎస్.యాదగిరి, సుబ్బారావు, సంది శ్రీనివాస్, నర్సింహ, రవీందర్, పి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మూడు ఎంఎల్ పార్టీలు విలీనం

- సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీగా ఆవిర్భావం
- మార్చి 3, 4, 5 తేదీల్లో ఖమ్మంలో మహాసభలు

హైదరాబాద్, రాంనగర్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా, పీసీసీ సీపీఐ(ఎంఎల్), సీపీఐ (ఎంఎల్) రివల్యూషనరీ ఇనిషియేటివ్.. ఈ మూడు విప్లవ పార్టీలు విలీనమై సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీగా ఆవిర్భవించాయి. విద్యానగర్‌లో శనివారం ఈ మూడు పార్టీలకు చెందిన నేతలు సమావేశమై ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయా పార్టీల నేతలు పోటు రంగారావు, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, ప్రదీప్‌సింగ్ ఠాగూర్, సుభాష్‌దేవ్, కె.జి.రాంచందర్, కె.రంగారెడ్డి, కె.రమ, ఆర్.చంద్రశేఖర్, వి.కృష్ణ, చంద్ర అరుణ, ఎం.మల్లేష్, సదానందం, ఎస్.ఎల్.పద్మ మాట్లాడారు. కార్మికులు, కర్షకుల సమస్యలపై ఉద్యమాలు చేసిన కమ్యూనిస్టులందరూ ఐక్యం అయి బూర్జువా పార్టీలు అవలంబిస్తున్న కుల, మత రాజకీయాలకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉందన్నారు. సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ పార్టీకి సంబంధించిన పత్రిక పేరు కూడా మాస్‌లైన్ అని ఉంటుందని తెలిపారు. దేశంలో బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ మతాన్ని రాజకీయం కోసం వాడుకుంటున్నాయని ఆరోపించారు. మూడు పార్టీలు విలీనమైన సందర్భంగా మార్చి 3, 4, 5 తేదీల్లో ఖమ్మంలో జాతీయ మహాసభలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. 3వ తేదీన భారీ ర్యాలీ, బహిరంగ సభ జరుగుతుందని, 4, 5 తేదీల్లో ప్రతినిధుల సభ జరుగుతుందని తెలిపారు.

మహిళల ఆర్థిక స్వావలంబనకు ముద్ర రుణాలు

- బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గౌతమ్‌రావు

రాంనగర్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ముద్ర రుణాలు మంజూరు చేస్తున్నామని బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు అన్నారు. శనివారం బాగ్‌అంబర్‌పేట డివిజన్ శ్రీనివాసనగర్‌లో పంజాబ్ నేషనల్ బ్యాంక్ విద్యానగర్ శాఖ ఆధ్వర్యంలో ప్రజా డబ్బు - ప్రజా భద్రత అనే పేరుతో వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వయం ఉపాధి పథకాల ద్వారా రుణాలు పొంది ఉపాధి కల్పించాలన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ డీజీఎం ఎస్‌బిఎస్‌పి.రెడ్డి, డీజీడీఎం షా, చీఫ్ మేనేజర్ గోపాల్‌రావు, విద్యానగర్ శాఖ మేనేజర్ పి.ప్రశాంత్, మాజీ మంత్రి సి.కృష్ణాయాదవ్ పాల్గొన్నారు.

పేదలకు ఉచిత న్యాయ సేవలు అందించాలి

- ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

రాంనగర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పేదలకు ఉచిత న్యాయ సేవలు అందించేందుకు న్యాయవాద విద్యార్థులు కృషి చేయాలని ఎమ్మెల్యే జి.వివేక్ వెంకటస్వామి సూచించారు. శనివారం బాగ్ లింగంపల్లిలోని డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ న్యాయ కళాశాలలో న్యాయ విద్యార్థులకు ఓరియంటేషనల్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో కోర్టులు, ఇతర అంశాలపై అవగాహన లేకుండా ప్రజలు ఎన్నో విధాలుగా నష్టపోతున్నారని, వారికి న్యాయ సహాయం అందించేలా న్యాయవాదులు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఓయూ డీన్ విజయలక్ష్మి, కళాశాల ప్రిన్సిపాల్ సృజన, హైకోర్టు న్యాయవాది ఎం.బాలకృష్ణరెడ్డి, హైకోర్టు రిజిస్ట్రార్ డాక్టర్ విజయదిల్బట్, కళాశాల సెక్రటరీ జి.వినోద్, డాక్టర్ సరోజ, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై పార్లమెంట్‌లో బిల్లు పెట్టాలి



మాట్లాడుతున్న టీఎస్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్

రాంనగర్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ బిల్లుకు రాజ్యాంగ సవరణ చేసి పార్లమెంట్‌లో పెట్టకుండా కమిటీలు అంటూ కాలయాపన చేయ డం బీజేపీ ప్రభుత్వానికి తగదని టీఎస్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ అన్నారు. శనివారం విద్యానగర్‌లోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వర్గీకరణ నెరవేర్చకుండా బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కాలయాపన చేస్తున్నాయని వాపోయారు. మాదిగలపై ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తక్షణమే పార్లమెంట్‌లో వర్గీకరణ బిల్లు పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు డాక్టర్ మల్లేష్, గణేష్, కృష్ణ యాదగిరి, శ్యామ్‌రావు, రాజేష్, హన్మంతు, కొల్లూరు వెంకట్, ఎల్.నాగరాజ్, కె.వెంకట్ పాల్గొన్నారు.

విశ్వకర్మలు రాజకీయంగా అభివృద్ధి సాధించాలి

- ఎమ్మెల్సీ మధుసూదనచారి

బర్కత్‌పుర, జనవరి 20(ఆంధ్రజ్యోతి): విశ్వకర్మలు రాజకీయంగా అభివృద్ధి సాధించాలని ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి పిలుపునిచ్చారు. శనివారం నారాయణగూడలోని బొజ్జ జయసేన మెమోరియల్ హాల్‌లో నిర్వహించిన 4వ కార్యవర్గ సమావేశం సందర్భంగా తెలంగాణ విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం 2024 క్యాలెండర్‌ను మధుసూదనాచారి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు డాక్టర్ లాలుకోట వెంకటాచారి, రాష్ట్ర అధ్యక్షుడు వేములవాడ.మదన్‌మోహన్, ప్రధాన కార్యదర్శి చోల్లేటి కృష్ణమాచార్యులు, కోశాధికారి రాగిఫణి రవీంద్రచారి, విశ్వబ్రాహ్మణ ధర్మపీఠం సభాపతి డాక్టర్ త్రిమూర్తుల గౌరీశంకర్, పౌర సంబంధాల శాఖ జాయింట్ డైరెక్టర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.